సంపుటం 18 సంచిక 169 రిజిష్టరు నెం. H 45 స్థాపితం 1925

గోలకొండపత్రిక

హైదరాబాదు 22—7—1960 శుక్రవారము

సంపాదకుడు: ఎస్. నరోత్తమరెడ్డి ఎం. ఎ.

4 పేజీలు 7 నయా పైసలు

101175

9 ఏండ్లలో 9లక్షల ఎకరాల భూమి సేకరణ

ఉజ్జయిని, జులై 21: తొమ్మిదేండ్లలో తానుతొమ్మిదిలక్షల ఎకరాలభూమిని సేకరించగలిగానని, యింతవరకూ సేకరించిన భూమి అంతా దేశంలో పంపిణీ చేయబడిందనీ అక్కడ మంచిపంటపండుతున్నదనీ ఆచార్య వినోబాభావే అన్నారు. ఈ ఉద్యమంలో 8500 మందే పనిచేస్తూ యింత స్వల్పకాలంలో యింతభూమిని సేకరించి, పంపిణీ చేయడం చాల గణనీయమయిన విషయమనీ, తాననుకొన్నదానికంటే ఎక్కువగా భూదానోద్యమం విజయవంతమయినదనీ వినోబాభావేఅన్నారు అయితే కార్యకర్తలు లేక కొన్నిచోట్ల పంపిణీలో జాప్యం జరిగి ఉండవచ్చునన్నారు.

కాంగోకు సమితిసైన్యం తరలింపు

వియోపోల్ విల్లె, జులై 21: ఐక్యరాజ్యసమితిదళానికిగాను రష్యా స్వీడిష్ తదితర ఆఫ్రికాయేతరదేశాల దళాలు కాంగోలో దిగుతున్న రష్యావిమానాలలో ఘానావారు ఎక్కువగాఉన్నారు. శనివారం నాటికి బెల్జియన్ వారంతా విడిచివెళ్ళి పోవలసిఉంది. భద్రతామండలి కాంగోవ్యవహారాన్ని చర్చిస్తుంది గనుక స్వయంగా వాదించడానికి ప్రధాని లుమంబా రేపు విమానంలో బయలుదేరి న్యూయార్క్ వెళ్ళగలడట. అంతవరకూ మండలి చర్చను నిలిపివేయాలని కోరబడింది. కాని వాయిదాకు మండలి అంగీకరించలేదు. ఇంతవరకూ సమితిసైన్యం 4500 మంది కాంగోచేరారు. ఈవారాంతానికి మొత్తం 10,000 మంది చేరవలసిఉంది.

ప్రపంచంలోని తొలి మహిళాప్రధాని శ్రీమతి బండారునాయకే

'తటస్థ విదేశాంగ విధానం సింహళ భారతీయులసమస్య సత్వర పరిష్కారం'-కొత్త ప్రధాని ప్రకటన

సింహళంలో యిక రాజకీయ స్థిరత్వం సాధ్యమనిఆశాభావం

ఎన్నికలలోశ్రీలంక ఫ్రీడంపార్టీ విజయానికి భారతప్రధాని నెహ్రూ, అశోక్ మెహతా హర్షం

కొలంబో, జులై 21

సింహళ సాధారణ ఎన్నికలలో డెమోక్రటిక్ సోషలిస్టుపక్షమైన శ్రీలంకఫ్రీడంపార్టీ విజయాన్ని సాధించడంతో ప్రపంచంలో తొలిసారిగా మహిళను ప్రధాన మంత్రిణిగా వరించిన గౌరవము సింహళానికి దక్కింది. స్వర్గీయ బండారునాయకే సతీమణి శ్రీమతి సిరిమావో బండారునాయకే (44) చే నేటిమధ్యాహ్నం గవర్నర్ జనరల్ సర్ అలివర్ గుణతిలకే ప్రధాన మంత్రిణిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

అంతకు ముందే గవర్నర్ జనరల్ ప్రధాని డడ్లీ సేనానాయకే రాజీనామాను ఆమోదించారు. ఆయననాయకత్వంలోగల యునైటెడ్ నేషనల్ పార్టీ ఎన్నికలలోఘోరపరాజయాన్ని పొందింది.

రక్షణ, విదేశాంగశాఖల మంత్రిణిగా కూడ ప్రమాణాన్ని స్వీకరించిన శ్రీమతి బండారునాయకే నేటిరాత్రి తనమంత్రిమండలి సభ్యులపేర్లను నిర్ణయించి రేపు గవర్నర్ జనరల్ కు సమర్పిస్తుంది. తన మంత్రివర్గం సంఖ్య బహుశా 12 ఉండవచ్చునని ఆమె విలేఖరులకు చెప్పింది.

తన కుమారుడు అనురా (10), కుమార్తె చంద్రిక (18) లతో పాటు శ్రీమతి బండారు నాయకే గవర్నర్ జనరల్ అధికార గృహానికి రాగా వేలాది ప్రజలు జయజయ ధ్వానాలు చేశారు.

ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఆమె గవర్నర్ జనరల్ తో పాటు బాల్కనీపై నిలబడి ప్రజలకు దర్శనమిచ్చింది.

మొత్తం సింహళం పార్లమెంటులో ఎన్నికల ద్వారా భర్తీ కావలసిన 151 స్థానాలలో 75 స్థానాల్ని వ్యవస్థాపకుడు స్వర్గీయ బండారు నాయకే యొక్క సోషలిస్టు విధానాల్ని, తటస్థ విదేశాంగ విధానాన్ని అనుసరిస్తామని ప్రకటించిన శ్రీలంక ఫ్రీడం పార్టీకి వచ్చినవి. ఈ పార్టీ పార్లమెంటుకు మరో ఆరుగురిని నామినేట్ చేసేహక్కును కలిగిఉన్నది. అంటే 157 గురు సభ్యులుండే సభలో 81 గురు శ్రీలంక పార్టీసభ్యులు అవుతారు.

తన భర్తపై ప్రజలకున్న గౌరవభావమే తమపార్టీ విజయానికి కారణమని శ్రీమతి బండారు నాయకే విలేఖరులతో అన్నది, "అయితే గ్రామీణ ప్రజలకు నేను తెలుసు. నేను వారి గుడిసెలకు వెళ్ళాను. వారికి నాపై విశ్వాసం ఉంది. వారికొరకు శక్తికొలదీ కృషిచేస్తాను. కుటీర పరిశ్రమల్ని ప్రోత్సహిస్తాను" అని ఆమె అన్నది.

తన భర్త హత్యకు సంబంధించిన రాజకీయ కారణాల దర్యాప్తుకు వెంటనే ఒక కమిషన్ నియమింపబడుతుందన్నారు.

జీవితభీమాను జాతీయంచేయాలనీ, భారతీయుల సమస్యను ముందు పరిష్కరించాలనీ, తటస్థమయిన విదేశాంగ విధానాన్ని అనుసరించాలనీ తమపార్టీ భావిస్తున్నట్లు ప్రధాన మంత్రిణి నేటిరాత్రి బ్రాడ్‌కాస్టు ప్రసంగంలో అన్నారు.

ఇతర పార్టీల సహాయం లేకుండా స్వయంగా మంత్రివర్గాన్ని ఏర్పరచే విధంగా శ్రీలంక ఫ్రీడంపార్టీకి ఈసారి ఎన్నికలలో ఖచ్చితమైన మెజారిటీ లభించినది. ఈపార్టీకి 75 స్థానాలు లభించాయి. గవర్నర్ నామినేట్ చేసే మరో ఆరుగురు సభ్యులతో ఈ పార్టీబలం ఇంకా పెరుగుతుంది. సిలోన్ పార్లమెంటు స్థానాలసంఖ్య 157. శ్రీలంక ఫ్రీడంపార్టీకి జాతికమిముక్తి పెరుమునపార్టీ ట్రాట్‌స్కైట్టులు కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సహకారంగూడా ఉన్నది ఈ మూడు ఆర్జించుకున్న స్థానాలు 18. ఉత్తర తూర్పు రాష్ట్రాలలో ప్రాధాన్యంకల ఫెడరల్ పార్టీ గూడా దీనికి నిమయోచితమైన సహకారాన్ను ఇవ్వగలదు. దీనిబలం 15.

ఈ ఎన్నికలలో శ్రీలంకపార్టీ ఘనమైన విజయాన్ని చూరగొనడం సిలోనులో రాజకీయ పరిస్థితులు స్థిరపడటానికి దోహదకారి కాగలదు. గత సెప్టెంబర్‌లో సాలమన్ భండారు నాయకే హత్య చేయబడినప్పటినుండి సిలోనులో రాజకీయ అస్థిమితత్వం వ్యాపించిన సంగతి పత్రికాపాఠకులకు విదితం. ఈతని భార్యే సిరిమావో భండారునాయకే ఈమె వయస్సు 49 సంవత్సరాలు. ఈమె శ్రీలంక ఫ్రీడం పార్టీ ఛైర్‌మెన్, గవర్నర్ జనరల్ అలివర్ గుణతిలకె సిలోన్ ప్రభుత్వాని నిర్మాణం గూర్చి సంప్రదింపులకై ఈమెను ఆహ్వానించారు. ఈమెసిలోన్ తొలి మహిళా ప్రధానిగాను ప్రపంచంలో ఒకేఒక మహిళా ప్రధానిగాను కాగలదు. సిరిమావో భండారు నాయకే నిన్న ఉదయం ఇక్కడికి వచ్చినది. ఈమెకు ప్రజలు అతిఉత్సాహపూరితంగా స్వాగతమిచ్చారు.

ప్రధాని పదవిని విరమించిన డడ్లీ సేనానాయకే ఎన్నికలలో గెలుపొందిన శ్రీలంక ఫ్రీడం పార్టీని, ప్రధాన మంత్రిణిని అభినందిస్తూ ఒక ప్రకటన చేశారు.

నెహ్రూ అభినందన

న్యూఢిల్లీ, జులై 21: భారత ప్రధానినెహ్రూ సింహళంలో శ్రీలంకఫ్రీడం పార్టీవిజయానికీ, శ్రీమతి సిరిమావో బండారు నాయకే ప్రధాన మంత్రిత్వ బాధ్యతను స్వీకరించడానికి అంగీకరించి నందుకూ హర్షం వెలిబుచ్చుతూ ఆమెకు వ్యక్తిగత సందేశాన్ని పంపారు. మన ఉభయదేశాల మైత్రి బలపడగలదనీ, మనల్ని ఎదుర్కొనే సమస్యల్ని పరిష్కరించుకోగలమనీ ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

శ్రీ సంజీవరెడ్డి హర్షం

సింహళ ఎన్నికలలో ఒకే పార్టీకి పరిపూర్ణ మెజార్టీ వచ్చినందుకు సంతోషిస్తున్నానని కాంగ్రెసుఅధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి అన్నారు. మన పొరుగు దేశములో సుస్థిరత ఏర్పడి అది పురోగమిస్తుంటే మనకు సంతోషకరమని ఆయనన్నారు.

అశోకమెహతా హర్షం

భారత ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ అశోకమెహతా సింహళ ఎన్నికలలో శ్రీ లంకఫ్రీడం పార్టీ విజయాన్ని పొందినందుకు హర్షం వెలిబుచ్చుతూ ఒక ప్రకటన చేశారు. దీన్ని బట్టి ప్రపంచ ప్రజల వైఖరి ఎలా మారుతున్నదో తెలుతుందన్నారు.

కాంగో విదేశాంగ మంత్రి అరెస్టు

ఎలిసబత్‌విల్లి, జులై 20

కాంగో విదేశాంగ మంత్రి జస్టిన్ బొంబాకో ఎలిసబత్‌విల్లి విమానాశ్రయంలో దిగగా ఆతను అరెస్టు చేయబడినాడు.

బెల్జియం సైనికులు బొంబాకోను అవమానంలోనే దిగిన ఆతని అనుచరున్ని అరెస్టుచేశారు. ఈలోగా బెల్జియం సైనికులు రాగానే వీరిని వారికి అప్పగించారు. ఈవిమానపు పైలెట్ కటాంగా అధికారులకు ముందుగానే బొంబాకో వస్తున్నట్టు రేడియోసంకేతాలద్వారా తెలిపాడట.

క్రితంవారం వేరుపడిన కటాంగా రాష్ట్రం లియోపాల్డివెల్లి ప్రభుత్వ ప్రతినిధుల పలువురిని ఈవరకే నిర్బంధించినది.

ఢిల్లీలో నేపాల్ రాజు

కొత్తఢిల్లీ, జులై 21

నేపాల్ రాజు మహేంద్ర నేడు రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాదును కలిశారు. మహేంద్ర గౌరవార్థం రాష్ట్రపతి విందు చేశారు.

నానావతిపై శిక్షను నిలిపివేసేఅధికారం

గవర్నరుకు లేదని బార్ అసోసియేషన్ ప్రతినిధి వాదం

న్యూఢిల్లీ, జులై 21

శ్రీ సి. బి. అగర్వాల్ నానావతి కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు కాన్‌స్టిట్యూషన్ బెంచిముందు భారత బార్ అసోసియేషన్ తరపునవాదిస్తూ కమాండర్ నానావతికివిధించినయావజ్జీవ జైలుశిక్షను సస్పెండుచేసి అతడు సుప్రీంకోర్టుకు అపీలు చేసుకొని అది తేలేవరకూ నౌకాదళ నిర్బంధంలోనే ఉండేటట్లు ఉత్తర్వుచేయడానికి బొంబాయి (ఇప్పటి మహారాష్ట్ర) గవర్నరుకు అధికారం లేదన్నారు.

సుప్రీంకోర్టుకు అపీలు చేసుకొనే వరకూ శిక్షను గవర్నరు నిలిపి ఉంచవచ్చునుగాని, అపీలును సుప్రీంకోర్టు పరిష్కరించేవరకూ నిలిపిఉంచ రాదని అన్నారు.

శిక్ష అమలు, నిలుపుదలకు, సుప్రీంకోర్టుకు పూర్తి అధికారమున్నదని గవర్నరు కోర్టుకుగల అధికారాన్ని వినియోగించరాదనీ ఆయనఅన్నారు. గవర్నరు చర్యవలన కోర్టు అధికారానికి భంగం కలిగినదన్నారు.

మహదేవ్‌సింగుకు జైలుశిక్ష విధింపు

హైద్రాబాద్, జులై 21

కేంద్ర సిబ్బంది సమ్మె సందర్భంగా అరెస్టుఅయిన మజ్‌దూర్ సంఘనాయకుడు బి.ఎస్. మహదేవ్‌సింగ్‌కు నగర మేజిస్ట్రేట్ శ్రీ లక్ష్మారెడ్డి 10రోజుల జైలుశిక్ష విధించారు.

ఎన్. సత్యనారాయణరెడ్డి, మల్లికార్జునరావు, సాంబమూర్తులను ఇంకా విచారించవలసిఉంది.

ముస్తాంగ్ సంఘటనలో మరణించిన నేపాల్ అధికారి

నష్టపరిహారమివ్వనైనాంగీకారం

హాంకాంగ్, జులై 21

క్రితంనెల ముస్తాంగ్ వద్ద జరిగిన సరిహద్దు సంఘటనలో మరణించిన నేపాల్ అధికారి కుటుంబానికి నష్టపరిహారంగా రు. 50 వేల చెల్లించమని చైనాను నేపాల్ ప్రభుత్వం కోరగా చైనా అందుకు అంగీకరించినది.

నేపాల్ ప్రధాని కొయిరాలాకు చైనీస్ ప్రధాని చౌ ఎన్ లైవ్రాసిన లేఖలో త్వరలోనే ఈ మొత్తాన్ని పంపించేపర్పాట్లు చేస్తామని తెలిపారు

కృశ్చేవు క్యూబా సందర్శన

అనుకున్న ప్రకారం కొనసాగగలదని స్పష్టీకరణ

మాస్కో, జులై 21

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ తాము ఆహ్వానింపబడిన రీతిగా క్యూబాకు వెళ్ళనున్నామని ప్రకటించాడు. క్యూబా ప్రధాని ఫిడల్ కాస్ట్రోను సోవియట్ రష్యా సందర్శించవలసినదిగా ఆహ్వానించాడు. ఈవారం క్యూబా రక్షణ మంత్రి ఆదేశ ప్రధాని సోదరుడగు డాక్టర్ రాల్ కాస్ట్రో కృశ్చేవ్‌ను కలిశాడు. ఆతనికి క్యూబాకు అమెరికానుండి పూర్తి రక్షణను సోవియట్ యూనియన్ ఇవ్వగలదని హామీ ఇచ్చారు.

పాట్నా, జులై 21

కోసీనది పొంగిన ఫలితంగా సహర్స దర్భాంగ జిల్లాలలోని సుమారు 8 వందల గ్రామాలలో చాలవరకూ మునిగిపోయినవి, 35వేల మంది మరోచోట సర్దుకోగా 80వేల మంది యింకా నదీతీరాన ఉన్నారు.

నేపాల్ రాజు మహేంద్ర సతీసమేతంగా మొన్న భారతరాజధానికివచ్చినప్పుడు విమానాశ్రయంలో రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్, ప్రధానినెహ్రూ ప్రభృతులు స్వాగత మిచ్చినప్పటిచిత్రం.

ఆర్.టి.సి. కార్యకలాపాల విస్తరణ

పద్ధతులు, మార్గాల సూచనకు అనంతరామకృష్ణన్ అధ్యక్షతన కమిటీ నియామకం

హైదరాబాద్, జులై 21

దళలవారీగా బస్సు రవాణాను జాతీయం చేయడానికి తగు పద్ధతులను సలహాలను సూచించడానికి ఆంధ్రప్రదేశ్ రోడ్డుట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ అనంతరామకృష్ణన్ (మద్రాసు) అధ్యక్షతన నలుగురుసభ్యుల కమిటీని నియమించినది.

ఈకమిటీ విచారించాల్సిన అంశాలు ఇవి: "కార్పొరేషన్ ప్రస్తుతం నిర్వహిస్తున్న వ్యాపారమేకాక దానివిస్తరణకై దీని వ్యవస్థా నిర్వహణను పరిశీలించి నివేదించుట, (2) కార్పొరేషన్ పరిపాలన ఆర్థిక సాంకేతిక విభాగాల నిర్వహణను పరిశీలించి వాని అభివృద్ధికి తగునలహాల ఇచ్చుట, (3) సమర్థమయిన విధంగానూ, పొదుపుగానూ క్రమబద్ధంగానూ పూర్వ నిర్ణయాన్ని అనుసరించి దళలవారీగా కొత్తప్రాంతాలకుకార్పొరేషన్ కార్యకలాపాల విస్తరించుటకు తగిన పద్ధతులను మార్గాలను సూచించుట.

ఈకమిటీ మిగతా సభ్యులు: శ్రీ జె.పి.యల్. గ్విన్ (ఆర్.టి.సి. వైస్ ఛైర్‌మన్), శ్రీ .న్. రామయ్య (రిటైర్డు అకౌంటెంటుజనరల్ - ఆంధ్రప్రదేశ్), శ్రీ ఎ.కె.కె. నంబియార్ (ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్).

ఇద్దరు బెల్జియం సైనికుల మృతి

లియోపాల్డువెల్లి, జులై 21

కివ్ రాష్ట్రంలోని ఉత్తర భాగములో కాంగో సైనికులకు బెల్జియం సైనికులకు జరిగిన ఘర్షణలో ఇద్దరు బెల్జియం సైనికులు చనిపోయారని ఒకరు గాయపడినారని తెలుస్తున్నది.

దేశీయ వైద్య విధానాల అభివృద్ధి

చట్టబద్ధమైన మండలిని ఏర్పాటు చేయాలని ఆయుర్వేద వ్యవహారాలసంఘ సిఫార్సు

న్యూఢిల్లీ, జులై 21

దేశీయ వైద్యవిధానాలనూ, చికిత్సావిధానాల అమలును అదుపులోపెట్టి క్రమబద్ధం చేయడానికి ఒక కేంద్ర దేశీయ వైద్య మండలిని చట్టరీత్యా ఏర్పాటుచేయాలని ప్రణాళికా రచనా సంఘము శాలూకు ఆయుర్వేద వ్యవహారాల సంఘము సిఫార్సుచేశారు.

దేశీయ వైద్యవిధానాలకు దేశ ఆరోగ్య కార్యక్రమాలలో తగిన స్థానం, పరిగణన యివ్వాలంటూ ఆవిధానాలలో ప్రాక్టీసుచేసే వైద్యుల ప్రతిపత్తి హక్కులు వారు తగిన శక్తిసామర్థ్యాలు కలిగివుండి, ఆధునిక వైద్యవిధానాలలో ప్రాక్టీసు చేసే వారితో సమానముగా వుండాలని ఈ సంఘము సూచించింది.

ఆయుర్వేద కళాశాలల ప్రతిపత్తిని పెంచాలనీ, దేశీయ వైద్యవిద్యను మాత్రం బోధించే 5 ఏళ్ల డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టాలనీ, ఆసంస్థలో విద్యార్థులను చేర్చుకోడానికి కనీస ప్రమాణాలను నిర్ణయించాలనికూడా ఆసంఘము సిఫార్సుచేసింది. అయితే ప్రభుత్వోద్యోగాలలో చేరదల్చిన వారికి మరో రెండేళ్లు చదువుకుని డిగ్రీని పొందడానికి సౌకర్యాలు ఏర్పాటుచేయాలన్నారు. వీటన్నిటికీ పోస్టుగ్రాడ్యుయేట్ - పరిశోధనా కేంద్రాలను నెలకొల్పాలనీ, ఆయుర్వేద పాఠ్యవిషయాల కనుగుణంగా సముచితమైన పాఠ్యగ్రంథాలను తయారుచేయాలనికూడా సిఫార్సుచేశారు.

సరోజ బాల హత్య కేసు

రాష్ట్రప్రభుత్వ అపీలు త్రోసివేత

అహ్మదాబాద్, జులై 21

భారత్‌కుమార్ భార్య 20సంవత్సరాల వయస్సుగల సరోజబాలను నిప్పంటించి చంపారనే ఆరోపణపై నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ కేశవభాయ్ మెహతా ఆతని కుమారుడు భారత్‌కుమార్‌ను విచారించి రాజకోట్ సెషన్స్‌జడ్జి నిర్దోషులని తీర్పు ఇవ్వగా దీనిపై గుజరాత్ ప్రభుత్వం హైకోర్టుకు చేసుకున్న అపీల్‌ను డివిజన్ బెంచివారు నిరాకరించారు.

నహర్‌కటియా ప్రాజెక్టు

నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి

న్యూఢిల్లీ, జులై 21

నహర్‌కటియా థెర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆప్రాజెక్టు క్రింద ఆస్సాంలోని నామరూపువద్ద ఒక థెర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రం విద్యుచ్ఛక్తి సరఫరా లైనులు నిర్మించబడతాయి. ట్రాన్సుమిషన్ లైనుల మొత్తం పొడవు 316 మైళ్ళు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తము 926.71 లక్షల రూపాయలు ఖర్చు కాగలవు. ఈ ప్రాజెక్టుపని 1960-61 లో ప్రారంభం కాగలదు. దీనికింద 0,400 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదు.

కేంద్రసిబ్బందిసమ్మె బాధితులకుసహాయం

హైద్రాబాద్, జులై 21

సమ్మె సందర్భంలో శిక్షింపబడిన వారు వెంటనేఅట్టిశిక్షకు వ్యతిరేకంగా అపీలు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు, రాష్ట్రశాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ మఖ్దూమ్ మొహియొద్దీన్ నిన్న ఒక పత్రికా ప్రకటనచేస్తూ పలహాయిచ్చారు. వారికి వేయబడిన శిక్షలపై అపీలు చేసుకొనుటకు వీలుగా కేంద్రసిబ్బందికి ఉదారంగా విరాళాలుఇవ్వవలసినదిగా శ్రామిక వర్గాన్ని ప్రత్యేకించి తమ సంఘానికి అనుబంధంగా వున్న వాటిని అభ్యర్థించారు. సమ్మెలో పాల్గొన్న రాష్ట్రంలోని కేంద్ర సిబ్బందిలోకొందరికి మూడుమాసాల జైలుశిక్ష, మరికొందరికి కొన్ని రూపాయల జరిమానా విధించారని ఆయన తెలిపారు. ఇంట నగరాలలోనే ఈ పాటికి 120 మంది శిక్షింపబడి, దాదాపు 8 వందల మంది కేసులు విచారణలో నున్నవన్నారు. ప్రభుత్వోద్యోగుల నడవడి నిబంధనల ప్రకారం శిక్షింపబడినవారు శాశ్వతంగా తొలగింపబడుతారని, ఒకవేళ అట్టివారు అపీలు చేసుకొన్న పక్షంలో వారు తొలగింపబడక కేవలం సస్పెండ్ చేయబడి ఆ కాలంలో (అపీలు చేసిన) వారు తమ వేతనాలను తీసుకొనే హక్కు కలిగి ఉంటారని ఆయన తెలిపారు.

సమ్మె కాలంలో వేతనం ఉండదు

కొన్నివేల మంది సమ్మెనాయకులపై బర్తరఫ్?

న్యూఢిల్లీ, జులై 21

సమ్మెవిరమణ అనంతర పరిస్థితిని నేడు ఉన్నత స్థాయిలో ప్రభుత్వం పరిశీలించినది. నిన్ననే క్రమశిక్షణ చర్యలపై వివరణాత్మకమైన ఉత్తర్వులు జారీచేయ బడినవట. అవి రేపు వెల్లడించ బడుతాయి.

సమ్మెదార్లపై కఠినవైఖరిని అవలంబించడం ప్రభుత్వ విధానం కాదనీ, శాఖాధిపతులకు ఎక్కువఅధికారాలుంటాయనీ పేర్కొన బడింది అయితే సమ్మెచేసిన 220 వేలమందిలో చాలమందికి సమ్మెకాలంలో జీతంరాదనీ కొన్నివేలమంది నాయకులకు ఉద్యోగాలు పోతాయనీ భావించ బడుతున్నది.

కొన్నికేసులలో మినహా ఉద్యోగుల వేతనాల స్కేల్సును ప్రభుత్వము ఆమోదించినదనీ అవి త్వరలో ప్రకటించ బడుతాయనీ తెలుస్తున్నది.

కృపలానీ ప్రకటన

ప్రజా సోషలిస్టునాయకుడుఆచార్య కృపలానీ ఒక ప్రకటనలో ప్రభుత్వం దేశంలో పెద్ద మానవతా రాజకీయ సమస్యను సృష్టించరాదనీ సమ్మెలో పాల్గొన్న వారిపై చర్య తీసుకొనే హక్కును శాఖాధిపతులకు వదలరాదనీ అలాచేస్తే విభేదాలు తగ్గవనీ పేర్కొన్నారు. (పి. టి. ఐ)

కృతజ్ఞత

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెవల్ల యేర్పడిన పరిస్థితిని ఆదుకోటానికి రాష్ట్రం నలుమూలల నుండి పలువురు వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వానికి తమ సంసిద్ధతను తెలియజేసినందుకు వారందరికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృతజ్ఞత తెలుపుతూన్నది. వ్యక్తిగతంగా అభినందన లేఖలు పంపుతూ వున్నప్పటికీ, పొరపాటువల్ల ఎవరికైనా తప్పిపోయినా, వారందరికీ తెలియడానికని యీ అభినందన సందేశం ప్రకటించటమైంది.

కేంద్ర విద్యుచ్ఛక్తి, నీటిపారుదలశాఖ ఉపమంత్రి శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు స్థలినిసందర్శించి నప్పటి ఫొటో.



"డఫెరిన్" శిక్షణ నౌక

ఆగస్టు 1 నుంచి
కొత్త తరగతులు

న్యూఢిల్లీ, జులై 21

వ్యాపార నౌకాశాఖలో జేరేందుకుగాను 80 మంది అభ్యర్థులు "డఫెరిన్" శిక్షణ నౌకలో వచ్చే 1వ తేదీన ప్రారంభమయ్యే తరగతులలో తర్ఫీదు పొందుతారు.

1927 డిసెంబరు 1వ తేదీన "డఫెరిన్" నౌకలో శిక్షణ తరగతులు ప్రారంభించినది లగాయతు యింత వరకూ 1978 మంది అభ్యర్థులు అక్కడ శిక్షణ పొందారు.

ఇందులో ప్రవేశంకోసం దరఖాస్తులు పెట్టుకునే అభ్యర్థుల సంఖ్య గత కొద్ది సంవత్సరాలనుంచి క్రమంగా పెరుగుతోంది.

నిరుటినుంచి యీ శిక్షణ నౌకలో జేర్చుకునే విద్యార్థుల సంఖ్యను 75 నుంచి 80 కి పెంచారు.

ఈ అభ్యర్థులు డఫెరిన్ నౌకలో మామూలు శిక్షణ పొందడమేగాక, భారత నౌకాదళం నిర్వహించే మరో రెండు శిక్షణ తరగతులకు కూడా హాజరవుతారు. అందులో ఒకదానిలో కవాతూ, రైఫిల్, డ్రిల్లూ, తుపాకులు ఉపయోగించడం నేర్చుతారు. శిక్షణ కాలం పదిరోజులు. డఫెరిన్ నౌకలో తొలి సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత యీ శిక్షణయేర్పాటు చేయబడుతుంది.

ఎ. బి. సి. డి అండ్ డి/సి అనే రెండవ శిక్షణ తరగతులు లోనవాలాలోని ఐ. ఎన్. ఎస్ "శివాజి"నౌకలో నిర్వహించబడతాయి. శిక్షణ కాలం ఆరురోజులు.

"డఫెరిన్" నౌకలో శిక్షణ పొందినవారిలో అత్యధిక సంఖ్యాకులు ఆ తరువాత ఉద్యోగాలలో మంచి పేరు తెచ్చుకున్నారు.

భారత నౌకాదళంలో అయితేనేం, వ్యాపార నౌకాశాఖలోఅయితేనేం, శిక్షణ సంస్థలలో అయితేనేం ప్రస్తుతం పనిచేస్తున్న యిందుమించు అందరు సీనియర్ ఉద్యోగులూ ఆదిలో డఫెరిన్ నౌకలో తర్ఫీదు పొందిన వారే.

డఫెరిన్ నౌకలో శిక్షణ పొందిన వారిలో 287 మంది ఇంజినీర్లు, బర్మాలో 68 మంది, సింహళంలో 17 మంది, పాకిస్తానులో 33 మంది వున్నారు. ఇండియన్ ఎక్జిక్యూటివ్ కేడెట్లు 1080 మంది.

1927 నవంబరునుంచి 1959 డిసెంబరువరకూ యీ నౌకలో శిక్షణ పొందిన వారిలో ఎక్కువమంది బొంబాయి (సౌరాష్ట్రతోకూడిన) రాష్ట్రం నుంచి వచ్చారు. వారి సంఖ్య 478. పంజాబునుంచి 218 మంది, మద్రాసు రాష్ట్రంనుంచి 181 మంది, ఉత్తర ప్రదేశ్ నుంచి 164 మంది, బెంగాలు నుంచి 128 మంది, మధ్యప్రదేశ్ నుంచి 89 మంది, ఢిల్లీనుంచి 70 మంది, కేరళనుంచి 60 మంది, బీహారునుంచి 23 మంది వచ్చారు.

అడవి భూములను ఆక్రమించినవారిపై చర్య

గద్వాలలో మంత్రి
శ్రీ పల్లంరాజు స్పష్టీకరణ

మహబూబ్‌నగర్, జులై 21

కొత్తమొక్కలను నాటుటద్వారా అడవుల ఉత్పత్తులను పెంచాలని ఆటవీ శాఖామంత్రి శ్రీ పల్లంరాజు గద్వాల మునిసిపాలిటీ వారు తమకు సమర్పించిన పౌరసన్మానానికి సమాధానమిస్తూ తెలిపారు. అడవి భూములను ఆక్రమంగా స్వాధీనపరచుకొన్న వారిపై చట్టరీత్యా చర్యలుతైకొనబడునన్నారు. కాని చాలరోజులనుండి అట్టి భూములను సాగుచేస్తున్న వారిని తొలగించుట జరుగదన్నారు. గద్వాల అరణ్యానికి చెందిన 18 వేల ఎకరాలను ఏవిధంగాను పంచిపెట్టుట జరుగదని మంత్రిగారు నొక్కి చెప్పారు.

---

3 రోజుల్లో బెల్జియం సైన్యాల ఉపసంహరణ

కాంగో పరిస్థితిపై
రష్యా తీర్మానం

న్యూయార్క్, జులై 21

కాంగో రిపబ్లిక్ రాజకీయసంఘటితత్వాన్ని గౌరవించాలని దానిలోని బెల్జియం సైన్యాలన్నీ మూడు రోజులలోగా వెళ్ళిపోవాలని కోరే తీర్మానాన్ని భద్రతామండలిలో గతరాత్రి సోవియట్ యూనియన్ ప్రతిపాదించినది.

శార్వరి సం॥ ఆషాఢ బ॥ చతుర్దశి
రా 9-43 ఉద్రి వ 12.35
రా వ 2-3 మొ: 3-51 వరకు
(శాలివాహన శకము: 81-4-1882)
1960 జూలై 22 శుక్రవారము

" పరిశుద్ధిలేని కుత్సిత
పురోహితులు నీచ
దశలఁ బొందుదురు
మహీవర యల్ప మె
కుద్దుండై పురోహిత
త్వంబు సేత భూపతి
నగరన్."

-భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 జూలై 22
శుక్రవారము

దేశీయ వైద్య విధానము

ఆయుర్వేద వైద్య విధానానికి సంబంధించిన సమస్యలను పరిశీలించుట కొరకు ఒక ఉపసంఘమును నియమించినది. ప్లానింగ్ కమిషన్ యీ విధముగా యీ విషయమై శ్రద్ధ తీసికొనుట ముదావహము. ఈ ఉపసంఘ సమావేశము యీ వారము ఢిల్లీలో జరిగినది. ఇందులో కేంద్రప్రభుత్వ ఆరోగ్య మంత్రి శ్రీ కర్మార్కర్ గారు పాల్గొని ప్రసంగించియున్నారు. కేంద్ర ఆరోగ్యమంత్రి తమ ప్రసంగములో దేశీయ వైద్య విధానములోని ఉపయుక్తములైన అంశాలను మనము తప్పక గ్రహించవలసి యుండునని ఉద్ఘాటించియున్నారు.

కొంత కాలమునుండి మన దేశములో ఆంగ్లవైద్య విధానము అవలంబించు వారికిని దేశీయ వైద్య విధానమును అవలంబించు వారికిని మధ్య ఒక విధమైన ద్వేషము కనుపించుచున్నది. ఆంగ్లవైద్య విధానమును దేశీయ వైద్యులు హర్షించని నిదర్శనాలు కనుపించుచున్నవి ఆంగ్లవైద్య విధానమును అవలంబించు వారు దేశీయ వైద్య విధానమును యీసడించుకొను దృష్టాంతములు గోచరించుచున్నవి. ఈ పరిస్థితి అభిలషణీయము కాజాలదు. ఈ విధముగా యీ రెండు విధానాల మధ్య పరస్పర అసహనము ఉండవలసిన ఆవశ్యకత లేదు. ఈ రెండు విధానాలుగూడ అమలులో నుండుట వలన సంఘర్షణ కలుగవలసిన అవసరము లేదు. అందుచేత యీ విధమైన సంకుచిత మనస్తత్వమును వదలిపెట్టి, మంచి యెక్కడ నున్నప్పటికిని గ్రహించి, అందువలన ప్రజలకు అత్యధిక ప్రయోజనము కలుగునట్లుగా ఉపయోగించుకొను మనస్తత్వమును అభివృద్ధి చేసికొనవలసి యుండును. ఈ ఆవశ్యకత యీ ఉపసంఘ అధ్యక్షులు శ్రీ నందాగారు తమ ఉపన్యాసములో ఉద్ఘాటించియున్నారు.

కొన్ని సందర్భాలలో బోధన విషయములోగూడ అభిప్రాయ భేదాలు పొడసూపి యున్నవి. ఈ రెండు విధానాలను సమన్వయించి బోధించు ప్రణాళికలపట్ల అలోపతి వైద్యులు తీవ్రఅసంతృప్తినివెల్లడిచేసిన సంఘటనలుకనుపించుచున్నవి. రెండు వైద్య విధానాలకు పరస్పర సంబంధము లేనిరీతిగా, విడివిడిగా బోధించుయేర్పాటులు చేయవలెనని ఒక అభిప్రాయము కలదు. ఉభయ విధానాలను సమన్వయించి బోధించవలెనను మరొక అభిప్రాయము కూడ కలదు ఈ విషయమై హైదరాబాదు నగరములోని విద్యార్థులు కొంత ఆందోళనగూడ చేసియుండిరి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము డాక్టర్ మేల్కొటేగారి అధ్యక్షతన యీ సమస్యను పరిశీలించి ఒక నివేదికను అందజేయుటకు ప్రత్యేక సంఘము నొకదానిని నియమించియుండెను. ఈ సంఘము తన నివేదిక సమర్పించినదో లేదో తెలియదు. ఒకవేళ నివేదికను సమర్పించినచో అందులో యేమి సూచనలు గావించబడినవో తెలియదు. ఈ నివేదికలోని సూచనలను ప్రకటించుట బాగుండగలదు.

ఈఉపసంఘ సమావేశములో దేశీయ వైద్య విధానము యొక్క అభివృద్ధి కొరకు ప్రత్యేక కృషి జరుగవలెనని శ్రీ నందాగారు తెలిపినారు. ఇందుకొరకు కేంద్ర సలహా సంఘము నొకదానిని అఖిల భారతస్థాయిలో నెలకొల్పవలెనని శ్రీ నందాగారు చేసిన సూచన చాల ఉపయోగకరమైనది. నిజానికి యిప్పటికే యీ కేంద్ర సలహాసంఘ నియామకముజరుగవలసి యుండెను. త్వరలోనే యిటువంటి కేంద్ర సలహా సంఘము యేర్పాటు చేయబడి దేశీయ వైద్య విధానాల వికాసానికి, విశేషించి ఆయుర్వేద విధాన అభివృద్ధికి దోహదముగా వించగలదని ఆశించుచున్నాము. ఇంతకు ముందు మేము బహు పర్యాయములు ఉద్ఘాటించినట్లుగా ఆయుర్వేదములో పరిశోధనను ప్రోత్సహించవలసిన ఆవశ్యకత యెంతయో కలదు. కొన్ని శతాబ్దాలనుండి, యీ రంగములో ప్రోత్సాహము లేనందువలన వికాసము స్తంభించిపోయినది. అందుచేత ఆయుర్వేద పరిశోధనకు అఖిలభారతస్థాయిలో ప్రత్యేకప్రాధాన్యము నీయవలసి యుండును. ఆయుర్వేద ఔషధాలను శాస్త్రీయముగా సిద్ధము చేయించుటకు ఉత్తమమైన యేర్పాటులు గూడ జరుగవలసి యుండును. శాస్త్రీయ పద్ధతిలో బోధన అవకాశాలను యితోధికముగా అభివృద్ధిచేసి, పరిశోధనను ప్రోత్సహించి, ఉత్తమ ఔషధాలను సిద్ధముచేయుటకు తగు అవకాశాలను కల్పించినచో ఆయుర్వేద వైద్యము వలన ప్రజలకు అపారమైన ఉపయోగము కలుగ గలదని నిస్సందేహముగా చెప్పవచ్చును.

రోడ్డు ప్రయాణానికి ఆటంకం

హైదరాబాద్, జులై 21

విశాఖపట్నం జిల్లాలోని విజయనగరము-పాలకొండ రోడ్డు-మైలు (5/'-8) నెల్లిమర్ల-రణస్థలం రోడ్డు (మైలు 0/4) మీద వరదలమూలంగా రాకపోకలకు ఆటంకము కలిగింది 8-8-1960 వ తేదీకి ఆటంకం తొలగి ప్రయాణానికి యథాతథంగా ఉపయోగ పడవచ్చు.

ఎక్కువ ఉత్పత్తినిచ్చే మంచిరకం విత్తనాలు

రాష్ట్రంలో పరిశోధనలు, పంపకాలు

హైదరాబాదు, జులై 21

మంచిరకం విత్తనాల ఉత్పత్తి సరఫరాకుగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1960-61 సంవత్సరానికిగాను రు. 4 న్నర లక్షలను కేటాయించినది.

ప్రభుత్వం రిజిస్టర్డు ఉత్పత్తి దారుల నుండి మంచిరకం వరి జొన్న,గోధుమ మొక్కజొన్న కాయధాన్యాల విత్తనాలకొని రైతులకు తక్కువ ధరలలో అందచేస్తుంది. రెండవ ప్రణాళికయొక్క తొలి నాల్గు సంవత్సరాలలో 11593 టన్నుల వడ్లు 350 టన్నుల గోధుమ రైతులకు ఈ స్కీము క్రింద ఇవ్వబడినవి. రెండవ ప్రణాళిక పూర్తి కాలానికి ఈ స్కీము క్రింద కేటాయించబడిన డబ్బు రు. 17 లక్షలు. దేశంలోని వివిధ పరిశోధనా కేంద్రాలలో అభివృద్ధి పరచబడిన విత్తనాల ప్రచారం చేయడం ఈ పథకంలోని ప్రధాన భాగం. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు వివిధ పంటలు పండించడానికి కావలసిన నీరు ఎరువుల ప్రమాణం ఎట్టివేలలంది వానిని చేయవలసినది తెలుపుటకు ఉద్దేశించినది. 1958-59లో ఇందుకై ఒక స్కీము చేపట్టబడినది. 1959-60లో కొన్ని ప్రయోగాలు జరిగాయి. 1898 రకాల నేలలు పరీక్షింపబడినవి అక్కుళ్ళ రకాన్ని అభివృద్ధి పరచుటకు రు. 4 వేలు మంజూరు చేయబడినవి. అధికంగా పంటనిచ్చే జొన్న, సజ్జ, కొర్రల రకాల అభివృద్ధికి రు. 9 వేలు శాంక్షన్ చేయబడినవి. ఆంధ్రప్రదేశ్‌లోని పరిశోధనా కేంద్రాలు 79 విత్తనముల రకాలను అభివృద్ధి పరచినవి.

షెడ్యూల్డు ప్రాంతాలకు సంబంధించిన సమాచారం

ప్రశ్నావళి జారీ

న్యూఢిల్లీ, జులై 21

షెడ్యూల్డు ప్రాంతాలు, షెడ్యూలు తెగల కమిషన్ ఆ ప్రాంతాల యొక్క, షెడ్యూల్డు తెగలయొక్క సంక్షేమానికి సంబంధించిన సమస్యల విషయంలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి ఒక ప్రశ్నావళిని జారీచేసింది.

ఆ ప్రశ్నావళికి సమాధానాలు పంపే గడువు తేది 1960 సెప్టెంబరు5. అందుకు సంబంధించిన ఏ అంశం గురించి అయినా వ్రాయదల్చిన వ్యక్తులు, సంస్థలూ, ప్రత్యేక లేఖను కూడ జతపరచ వచ్చును. ప్రశ్నావళి ప్రతులు కావల్సినవారు యీ క్రింది చిరునామాకువ్రాసి పొందవచ్చును. కార్యదర్శి, షెడ్యూల్డు ప్రాంతాలు, షెడ్యూల్డు తెగల కమిషన్, రాష్ట్రపతి భవనం, న్యూఢిల్లీ.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నెలకొల్పబడిన ఈ సంఘం షెడ్యూల్డు ప్రాంతాల నిర్వహణ, కొండజాతి ప్రజల సలహా సంఘాలు, ఆ ప్రాంతాలకు వర్తించే చట్టాలు. షెడ్యూలు తెగల సంక్షేమ మొదలైన వాటిని గురించిన నివేదికను ఈ సంవత్సరం డిసెంబరు 31వ తేదీలోగా రాష్ట్రపతికి అందచేయవలసి వున్నది.

వడ్లూరులో అన్నదానం

కరీంనగరం, జులై21

వడ్లూరుగ్రామాధికారి శ్రీమంగళపల్లి సత్యనారాయణరావు అన్నదాత ప్రపంచప్రళయంఅవుతుందని వడ్లూరు, జెగంపేట, కాసింపేట, పారుపెళ్ళ ప్రజలకు అన్నదానం 12, 13 తేదీలందు జరిపినారు. తేది 14 న గ్రామ ప్రజలచే ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటలవరకు నాల్గు త్రోవలు కలియుచోటున శ్రీ సత్యనారాయణవ్రతం జరుపబడినది. అన్నదానం గూడా మరల జరిగినది. శ్రీ రామ్‌రావు, జి.ప్రకాశరావు, చంద్రారెడ్డి, రామ్‌రెడ్డి అన్నదాన కార్యకర్తలు తేది 13, 14 న వ్యవసాయ పనులు ఆపుదలచేసి, భజనలు, దేవతాపూజలు, మంగళ వాద్యాలచేత జరిపించారు.

బెల్జియం సైనికుల ఉపసంహరణ

లియోపాల్డివెల్లి, జులై 21

లియోపాల్డివెల్లినుండి బెల్జియం సైన్యాల ఉపసంహరణ ప్రారంభమైనది. కొంతమంది బెల్జియం సైనికులు నగర వీధుల్లో కాన్పిస్తున్నారు.

సమితి దళానికి చెందిన మొరాకో సైనికులు ఈక్వేటర్ ప్రావిన్స్‌కు వెళ్ళారు. మూడు రోజులక్రితం దీనిని బెల్జియం పారాట్రూపర్లు ఆక్రమించుకున్నారు.

జంట కార్పొరేషన్‌ల లీనీకరణ బిల్లు

ప్రాంతీయ సంఘముచే
ఆమోదం

హైదరాబాద్, జులై 21

తెలంగాణా ప్రాంతీయ సంఘం ఈ నెల 17 వ తేదీన సమావేశమైనప్పుడు అసెంబ్లీచేత తనకు పంపబడిన హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (ఆంధ్రప్రదేశ్ సవరణ)బిల్లును (1960) మార్పులేమీ లేకుండా ఆమోదించారు. అదే సమావేశంలో అసెంబ్లీచేత తనకు పంపబడిన మరొక బిల్లును (హైదరాబాద్ భూనిలంధనలహక్కు, ఆంధ్రప్రదేశ్ సవరణ బిల్లు 1960) అభివృద్ధి పనులు చూసుకొనే ఉపసంఘానికి సమర్పించారు. పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి వెంటనే పూనుకొనేట్టుల కేంద్ర ప్రభుత్వానికి నచ్చచెప్పటకుగాను రాయబారం వెళ్ళుటకు తగు వ్యక్తులను నామినేటు చేసే పూర్తి అధికారాన్ని డెవలప్‌మెంట్ సబ్ కమిటీకి ఒప్పగిస్తూ ఒక తీర్మానం ఏకగ్రీవంగా ఆ సమావేశములో ఆమోదింపబడినది.

స్పెయిన్‌లో 200 అరెస్టులు

కమ్యూనిస్టు రహస్య ఉద్యమ చర్యలు

మాడ్రిడ్, జులై 21

స్పెయిన్‌లోని సెవిల్లికోర్డోవా రాష్ట్రాలలో విద్రోహకర చర్యలను ప్రోత్సహించే కరపత్రాల ప్రచురించి పంచిపెట్టారన్న నేరానికి గత వారం దాదాపు రెండువందల మంది అరెస్టు చేయబడినారు. ఆనకట్టలు, బ్రిడ్జీలు, పారిశ్రామిక సంస్థల విధ్వంసం చేసే వారికి 10 వేల పేసంటులు (288 డాలర్లు) బహుమతులు ఇవ్వబడగల వని ఈ కరపత్రాలలో కలదట. కోర్డోవా రాష్ట్రంలోని గ్రామాలలో జరిగినఅరెస్టులు వందవరకుఉన్నాయి. సెవిల్లి రాష్ట్రంలోను దాదాపు ఇదే సంఖ్యలో అరెస్టులుజరిగాయి రహస్య కమ్యూనిస్టు ఉద్యమం ఈరాష్ట్రాలలో కొనసాగుతున్నదని స్పెయిన్ ప్రభుత్వం అనుమానిస్తున్నది.

పట్టభద్రుల ఉద్యోగాలను గురించి సర్వే

ప్రశ్నావళులకు వెంటనే
జవాబులు పంపవలసిందిగా
విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జులై 21

భారత ప్రభుత్వం తాలూకు పునరావాస, ఉద్యోగకల్పన డైరెక్టరు జనరలు కార్యాలయంవారు పట్టభద్రుల ఉద్యోగ వృత్తిరీతులనుగురించి అఖిలభారత సర్వే ప్రారంభించినట్లు, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 22,000 మంది పట్టభద్రులకు సంబంధించిన ఈ సర్వేలో వారిఉద్యోగాల గురించి, రాబడి మొదలైన విషయాలను గురించి సమాచారం సేకరించడం అవుతుందనీ, కార్మిక ఉద్యోగ కల్పన మంత్రిత్వశాఖవారు నేడొక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఆప్రకటనలో యింకా ఇలా ఉంది: ఈ సందర్భంలో కొన్ని ప్రశ్నావళులను ముద్రించి వాటిని యిదివరకే పట్టభద్రులకు పంపడం జరిగింది. కాని ప్రశ్నావళులకు సమాధానాలు వ్రాసి వాటిని తిరిగి పంపినపట్టభద్రులసంఖ్య యింకా తగినంత లేదు. అందువల్ల ప్రశ్నావళులు అంది, వాటిని యింకా పూర్తిచేసి పంపని పట్టభద్రులు వాటికి వీలైనంత త్వరలో జవాబులువ్రాసి, ఈక్రింది చిరునామాకుపంపవలసిందిగా కోరడం అవుతున్నది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్మెంటు అండ్ ఎంప్లాయ్మెంటు, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయ్మెంటు, 18, గుర్ద్వారా రోడ్, న్యూఢిల్లీ.

సిలోన్ ఎన్నికల ఫలితాల స్వరూపం

కొలంబో, జులై 21

సిలోన్ పార్లమెంటుకు జరిగినఎన్నికల్లో ఇంకా ఒకే ఒక ఫలితం తెలువవలసి ఉన్నది

వాని వివరాలు ఇవి:— శ్రీలంక ఫ్రీడంపార్టీ 75, యునైటెడ్ నేషనల్ పార్టీ 30, ఎఫ్. పి. 15, ఎల్.ఎస్.ఎస్. పి. 12, సి. పి. 4, ఎమ్ ఇ పి 3, ఎల్. పి. పి. 2, కె. వి. పి. 2, టి. సి 1 స్వతంత్రులు 6.

సిలోన్ పార్లమెంటు స్థానాలు మొత్తం 157 ఇందు అర్హులు నామినేట్ చేయబడుతారు.

కాంగో రిపబ్లిక్ రాజకీయ సంఘటిత తత్వం

భిన్నంగా సమితి వ్యవహరించబోదని హామర్‌షెల్డ్ ప్రకటన

న్యూయార్క్, జులై 21

భద్రతా మండలి గత రాత్రి సమావేశమైనప్పుడు సమితి ప్రధాన కార్యదర్శి దాగ్ హామర్‌షెల్డు పూర్తి కాంగోను సంయుక్త రాజ్యసమితి ఒకే యూనిట్‌గా గుర్తించినదని దానినుండి విడిపడదలచిన కటాంగా రాష్ట్రీ నాయకుడు మోసేసాంబేకు గూడా తాము దీనినే స్పష్టం చేశామని అన్నారు.

కాంగో పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికి హామర్‌షెల్డు వచ్చేశనివారం లియోపాల్డువెల్లికి వెళ్ళుతున్నాడు. అక్కడ కాంగో నాయకులు సమితి ప్రతినిధులతో సంప్రదిస్తారు. అప్పటి వరకు సమితి దళాల బలం 10 వేల సైనికులకు పెరుగుతుంది.

కాంగో రిపబ్లిక్ అతి శైశవమైనదని దానికలతలను సవరించిఆ దేశపు స్వాతంత్ర్య జీవనం సవ్యపథంలో సాగేలా చేయాలని హామర్‌షెల్డు అన్నారు. భవిష్యత్తునుగూర్చి గొప్పగా విశ్వాసాన్ని కనబరచలేకపోయినా విశ్వాసమును కలిగించగల పరిస్థితికి భిన్నంగా కాంగోలేదని అన్నారు. సైనికంగాను ఇతర విధానాను సభ్యరాజ్యాలు కాంగోకు ఎక్కువ సహాయాన్ని ఇవ్వాల్సి ఉన్నదన్నారు

డడ్లీసేనా నాయకే మంత్రిమండలి రాజీనామా

కొలంబో, జులై 21

సిలోన్ గవర్నర్ సర్ ఆలివర్ గుణతిలకేకు ఈ జనరల్ ఎన్నికలందు ఓడిపోయిన యునైటెడ్ నేషనల్ పార్టీ నాయకుడు ప్రస్తుత ప్రధానిఅగు డడ్లీ సేనానాయకే తన మంత్రిమండలి రాజీనామాను అందచేశారు. ఈతని మంత్రిమండలి రాజీనామా గూర్చి త్వరలో అధికార ప్రకటన వెలువడుతుంది.

లెబనాన్ అధ్యక్షుని రాజీనామా నిర్ణయం మార్పు

బీరుట్, జులై 21

లెబనాన్ అధ్యక్షులు ప్రసిడెంట్ ఫౌద్ చెహాబ్ తాము రాజీనామా ఇవ్వాలనుకున్న పూర్వ నిర్ణయాన్ని మార్చుకున్నారు. అధ్యక్ష పదవిని యథా ప్రకారం కొనసాగించగలరు. ఈ వార్త లెబనాన్ ప్రజల ఆనందోద్రేకాలతో ముంచెత్తి వేసింది.

నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య

రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి
త్వరలో శాసనం

హైదరాబాద్, జులై 21

రాష్ట్రంలో నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టుటకై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఒక శాసనం చేయబోతున్నది.

ఈ విషయాన్ని రాష్ట్ర విద్యామంత్రి పత్రికా ప్రతినిధులకు తెలుపుతూ బిల్లు దాదాపు సిద్ధమైనదని వచ్చే శాసనసభ సమావేశంలో ప్రతిపాదింపబడగలదని అన్నారు. రెండవ ప్రణాళికాంతం వరకు 6 నుండి 11 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలలో 56 శాతం ఈ స్కీము క్రిందికి తేబడగలదన్నారు వీరు.

లండన్‌లో నాలుగు కామన్‌వెల్త్ దేశాల కళాకారుల ప్రదర్శన

లండన్, జులై 21

నాలుగు కామన్వెల్తు దేశాల కళాకారుల కళాఖండాల ప్రదర్శనకు లండన్‌లో భారత హైకమీషనరు శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ప్రారంభోత్సవం చేశారు. జమైకా నుంచి ఒకరూ, బ్రిటన్ నుంచి ఒక కళాకారుడూ ఇద్దరుభారతీయ కళాకారులూ తమ కళాఖండాలను ప్రదర్శించారు. యునైటెడ్ కింగ్డమ్‌లోని భారత కమీషనర్ జనరల్ భార్య శ్రీమతి టి. స్వామినాథన్, శ్రీమతి దమయంతి చేలా (న్యూఢిల్లీ) తమ కళాఖండాలను ప్రదర్శించారు.

జాన్ ఫిట్జరాల్డు కెనెడి

అమెరికా ప్రెసిడెంటు ఎన్నికకు
డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి

వాషింగ్‌టన్, జులై 21

లాస్ ఏంజిలిస్‌లో జరిగిన డెమోక్రాటిక్ పార్టీ కన్వెన్షన్ ప్రెసిడెంటు పదవికి పోటీచేయటానికి సెనేటర్ ఫిట్జరాల్డు కెనెడిని తనఅభ్యర్థిగాఎన్నుకొన్నది. ప్రెసిడెంటు పదవికిఎన్నికలు నవంబరు నెలలో జరుగనున్నవి.

శ్రీకెనెడి మేసచుసెట్స్ రాష్ట్రం నుంచి ఎన్నికైన సెనెటర్. ఆయన 1956 లో వైస్ ప్రెసిడెంటు పదవికోసం డెమోక్రాటిక్ పార్టీఅభ్యర్థిత్వానికి పోటీచేసి కొద్దిలోవోడిపోయారు.

ఆయన 1960 కన్వెన్షన్‌లో ప్రెసిడెంటు పదవికి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కావటం తథ్యమేనని అప్పటి నుంచి అంతా భావిస్తున్నారు. ఆయనకు విదేశాంగ వ్యవహారాలు, కార్మిక వ్యవహారాలపట్ల ప్రబలమైన ఆసక్తి. ఈ రంగాలలో జరిగే శాసనాలమీద ఈయన పలుకుబడి బాగా కనబడుతుంది. వ్యక్తిగతంగా చాలా సహృదయుడని ప్రతీతి.

ఆయన అమెరికా జాతీయ రాజకీయ ప్రముఖులలో ఒకరని 1956 లో జరిగిన డెమోక్రాటిక్ పార్టీ సమావేశంవల్ల దేశమంతటికి తెలిసింది.అయితే ఆయన మేసచుసెట్స్ రాష్ట్రంనుంచి ఎన్నికైన కాంగ్రెసు సభ్యుడుగా వాషింగ్టన్‌లో 10సంవత్సరాలపూర్వం నుంచి ప్రఖ్యాతి చెందారు. కాంగ్రెసులో ప్రతినిధుల సభా సభ్యుడుగా 1946 లో మొట్టమొదటిసారి కెనెడి ఎన్నుకోబడ్డారు. అప్పుడాయన వయస్సు 29 సంవత్సరాలు. తన 35వ ఏట 1952 లో కెనెడి అమెరికన్ సెనెటుకు పోటీచేసి రిపబ్లికన్ పార్టీఅభ్యర్థి పేరు ప్రతిష్ఠలు సంపాదించిన హెన్రీ కాబట్ లాడ్జిని ఓడించారు.

